క్లుప్తంగా

జవాన్లకు మద్దతుగా ప్రత్యేక పూజలు



నాగాయలంక: మండల బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పురాతనమైన శ్రీరుక్మిణీసత్య భామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిపారు. పాకిస్తాన్ ఉగ్రవాదులపై పోరు సల్పుతున్న భారతీయ సైనిక దళాలకు ఆత్మస్థైర్యం కల్పించాలని, యుద్ధంలో భారత్ విజయాన్ని కాంక్షిస్తు మండల పార్టీ అధ్యక్షుడు గుడివాక శివాజీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు డీవీకే సత్య ప్రసాద్ సైనికులకు విజయం సిద్ధించాలని కోరుతూ విశేష పూజ జరిపారు. అనంతరం భక్తులతో కలిసి జైహింద్ అంటూ నినదించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, సీనియర్ నాయకుడు చన్నగిరి లతామోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ స్థానిక బీజేపీ 4వ మండల నాయకులు శనివారం గొడుగుపేటలోని శ్రీ శాంతా మల్లేశ్వర స్వామి దేవాలయంలో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు ధూళిపాళ శ్రీరామ చంద్రమూర్తి ఆధ్వర్యంలో దేవాలయ పూజారి కందుకూరి సత్యనారాయణ, బీజేపీ నాయకులు సూరిశెట్టి హరికృష్ణ, హిమశేఖర్, సుబ్బారావు, వెన్న దుర్గ ప్రసాద్, అడివి శ్రీనివాస్, సీహెచ్.మల్లేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ నాయకులు వడ్రై రాజశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా కేబుల్



చల్లపల్లి: చల్లపల్లి- నడకుదురు ఆర్అండ్‌బీ రోడ్డులో మేకావారిపాలెం వద్ద విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైరు కిందికి జారిపోయి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై గజం ఎత్తుకంటే దిగువకు ఉండటంతో వాహనదారులు భయపడు తున్నారు. ఆ రోడ్డులో ఎదురుగా వాహనం వస్తే పక్కకు తప్పుకునేందుకు కూడా చాలా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. కరెంటు లైట్లు కూడా ఆ మార్గంలో లేకపోవటంతో రాత్రిళ్లు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వైరును పైఎత్తులో ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.50 వేల సాయం



అవనిగడ్డ: అవనిగడ్డకు చెందిన మాదివాడ రమేష్‌కు వైద్యఖర్చుల నిమిత్తం చైల్డ్‌హుడ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా రూ.50 వేలను ఆర్థిక సాయంగా అందించారు. సంస్థ సభ్యుడైన రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురై విజయవాడలో చికిత్స తీసుకున్నాడు. ఆయన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సంస్థ కార్యాలయంలో శనివారం ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్యదర్శి దీవి లీలాకృష్ణ ఈ మొత్తాన్ని రమేష్‌కు అందించారు. సంస్థ సభ్యులు కమ్మిలి ప్రసాద్, బండే శ్రీనివాసరావు, మోపి దేవి శ్రీనివాసరావు, అన్నపరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

18న గంగానమ్మ జాతర

నాగాయలంక: స్థానిక తలశిల వంశీయుల ఇలవేల్పు గంగానమ్మ తల్లి ఆలయంలో 23వ వార్షిక జాతర మహోత్సవం ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తలశిల శివరామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆ రోజు ఉదయం ఘటం శుద్ధి పూజ, తదుపరి అమ్మవారికి అభిషేకాలు, 8గంటలకు తలశిలవారి ఆడపడుచులచే పసుపు- కుంకుమ, సారె సమర్పణ, గుడి ప్రాంగణంలోని పోతురాజు స్వామికి నైవేద్యం, అమ్మవారికి పొంగళ్ల సమర్పణ, అన్న సమారాధన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. తలశిల వంశీయులు, భక్తులు హాజరవ్వాలని కోరారు.

డ్రెయిన్‌పై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

- బండిరేవు కోడు డ్రెయిన్‌పై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు
- అనుమతులు లేకుండా వంతెనలు, కాలిబాటల నిర్మాణం
- మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడంతో ముంపు సమస్య
- చోద్యం చూస్తున్న డ్రెయినేజీ అధికారులు



డ్రెయిన్‌పై వంతెన నిర్మించేందుకు ఏర్పాటు చేసిన తూములు

చల్లపల్లి: డ్రెయినేజీ కాల్వలపై ఎక్కడపడితే అక్కడ అనధికారికంగా నిర్మిస్తున్న వంతెనల కారణంగా పంట పొలాలకు ముంపు సమస్య పొంచి ఉంది. మురుగు పారుదలకు అడ్డంకులు ఏర్పడి వేలాది ఎకరాల పంట భూములు ముంపునకు గురయ్యే పరిస్థితి. డ్రెయినేజీ అధికారులు పట్టించుకోకపోవడంతో వంతెనలు నిర్మించేవారికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. పోటీ పడి వంతెనలు, కాలిబాటలు నిర్మిస్తున్నారు.

విషయం ఇదీ..

మండల పరిధిలోని పాగోలులో ప్రారంభమయ్యే బండిరేవు కోడు (మురుగునీటి కాలువ) చల్లపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం మీదుగా మేజర్ డ్రెయిన్ అయిన గుండేరులో కలుస్తుంది. సుమారు 8.2 కిలోమీటర్ల పొడవున్న ఈ బండిరేవు కోడు కింద 6,528 ఎకరాల పంటపొలాలు ఉన్నాయి. ఈ పంట పొలాల్లో పడిన వర్షపు నీరు బండిరేవు కోడు ద్వారా గుండేరులోకి పోతుంది.

సమస్య ఇదీ..

అయితే ప్రస్తుతం ఈ డ్రెయిన్‌పై ఎవరికివారు వారి ఇంటికి తిన్నగా నిర్ణీత కొలతలు లేకుండా వంతెనలు కడుతున్నారు. ఫలితంగా ముంపునీరు ప్రవహించే సమయంలో ఈ నిర్మాణాలకు చెత్తాచెదారం అడ్డుపడి ముంపు సమస్య ఏర్పడుతోంది. దీంతో ముంపు నీరు రోజుల తరబడి పంట పొలాల్లోనే నిల్వ ఉండి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో రైతులకు తీవ్రనష్టం.



వంతెనల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పిల్లర్లు

8.2 కిలోమీటర్ల పొడవు..

8.2 కిలోమీటర్ల పొడవున్న ఈ డ్రెయినేజీ కాలువపై ఇప్పటికే అనేక వంతెనలు, కాలిబాట వంతెనలు నిర్మించారు. వీటికి తోడు కొత్తగా పాగోలు గ్రామంలో మరికొందరు కొత్త నిర్మాణాలు చేపట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అనుమతులు లేకుండానే..

నిబంధనల ప్రకారం మురుగునీటి డ్రెయిన్లపై ప్రతి మూడు కిలోమీటర్లకు ఒక వంతెన చొప్పున ఏర్పాటు చేసేవారు. అయితే గ్రామ అవసరాలు, రాకపోకలకు అవకాశం కల్పించటం కోసం కొన్ని చోట్ల అవసరమైతే అధికారికంగా మరికొన్ని వంతెనలు ఏర్పాటు చేస్తారు. ఎవరైనా కొత్తగా డ్రెయిన్‌పై వంతెన నిర్మించాలంటే ముందుగా సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే పాగోలు గ్రామంలో బండిరేవుకోడుపై నిర్మిస్తున్న కాలిబాట వంతెలనకు అనుమతులు తీసుకోలేదని అధికారులు చెపుతున్నారు.



పాగోలు గ్రామంలో బండిరేవుకోడుపై నిర్మించిన కాలిబాట వంతెనలు

స్పందించని డ్రెయినేజీ అధికారులు..

ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు డ్రెయినేజీ, రెవెన్యూ అధికారులు ముందుకు రావటంలేదు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యత డ్రెయినేజీ శాఖ వారిదేనని రెవెన్యూ వారు. ఆ బాధ్యత రెవెన్యూ వారిదే నంటూ డ్రెయినేజీ శాఖ అధికారులు చెప్పుకుంటున్నారు.

అధికారం మాకు లేదు..

మురుగునీటి డ్రెయిన్లపై కడుతున్న అనధికార నిర్మాణాలను అడ్డుకునే అధికారం మాకు లేదు. డ్రెయినేజీల మీద పర్యవేక్షణ, వాటి బాగోగులు చూడటం వంటివి మాత్రమే మా పరిధిలో ఉంటాయి. అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ వారిదే.

– పి.చిరంజీవి, ఏఈ,డ్రెయినేజీ, చల్లపల్లి

ఆ బాధ్యత వారిదే..

డ్రెయిన్లపై జరగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన బాధ్యత డ్రెయినేజీ శాఖ వారిదే. వారు రాకుండా వాటిని అడ్డుకోవాలంటే కుదరదు. వారు వచ్చి మా సహాయం కోరితే సపోర్టుగా వెళ్లి నిర్మాణాలను అడ్డుకుంటాం.

– డి.వనజాక్షి, తహసీల్దార్, చల్లపల్లి

‘పీఎం సూర్యఘర్’ సద్వినియోగం చేసుకోవాలి

- మెప్మా పీడీ సాయిబాబు
- సదస్సులో 24 అర్జీలు స్వీకరణ

చల్లపల్లి: సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ, అవనిగడ్డ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు కోరారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు పరిచేందుకు మండల పరిధిలోని యార్లగడ్డ గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం యార్లగడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ శాఖ చల్లపల్లి ఏడీఈ శివనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో సాయిబాబు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయటం వల్ల కరెంటు బిల్లును తగ్గించుకోవటంతోపాటు మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పవర్ ప్లాంటులో తయారయ్యే విద్యుత్ ఇక నుంచి సూర్యఘర్ ద్వారా ఎవరికివారే తమ ఇళ్లల్లో ఉత్పత్తి చేసుకోవచ్చని విద్యుత్ శాఖ ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు డి.కృష్ణనాయక్ తెలిపారు. బాధ్యతాయుతమైన అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుగా ఈసోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుని సామాన్య ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవటం వల్ల ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం ఉండదని, పూర్తిస్థాయిలో పకడ్బందీగా ఏర్పాటు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో చల్లపల్లి మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆర్.సి.ఆనంద్ కుమార్, జిల్లా విద్యుత్ శాఖ అకౌంట్స్ ఆఫీసర్ జి.వేణుగోపాలరావు, ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీడీఓ ఎ.వి.రమణ, డెప్యూటీ ఎంపీడీఓ రవిశంకర్, విద్యుత్ శాఖ ఏఈ బసవశాస్త్రి, యార్లగడ్డ గ్రామ సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, అడ్వకేట్ తుటారం ప్రసాద్, సోలార్ వెండర్స్, బ్యాంకు అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

13 మంది ఎంపిక..

యార్లగడ్డలో నిర్వహించిన అవగాహన సదస్సులో సోలార్ విద్యుత్ ఏర్పాటుకోసం ప్రజల నుంచి మొత్తం 24 దరఖాస్తులు రాగా వాటిలో 13 మంది ఈ పథకానికి ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన వారి అర్జీలను కూడా పరిశీలించి ఎంపికచేయనున్నట్లు చెప్పారు.



పీఎం సూర్యఘర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మెప్మా పీడీ సాయిబాబు, అధికారులు

గూడూరు: మండల పరిధిలోని రామానుజవత్సర్లపల్లి గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచి రాజులపాటి రేణుకమ్మ అధ్యక్షతన జరిగినసదస్సులో ఎంపీడీఓ ఎం.వనజ పాల్గొన్నారు. ఈ సదస్సులో 21 మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నట్లు ఏఈ ఎం.రాజేష్ కుమార్ తెలిపారు.

సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

పెడన: పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని నందమూరు పీఏసీఎస్ ఆవరణలో పీఎం సూర్యఘర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ పెడన మండలంలో నందమూరు గ్రామాన్ని సూర్యఘర్ గ్రామంగా తీర్చిదిద్దడానికి మోడల్ గ్రామంగా ఎంపిక చేశారన్నారు. ఈ గ్రామంలో సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యుత్‌శాఖ డీఈ జి.గోవిందరావు మాట్లాడుతూ బ్యాంకు రుణాలతో వీటిని ఏర్పాటు చేసుకునే అవకాశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయన్నారు. జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, పెడన ఏడీఈ సీహెచ్ మాణిక్యలరావు, ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు. 52 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఏడీఈ తెలిపారు.

అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి

చల్లపల్లి: దేశం కోసం వీరోచితంగా పోరాడుతూ వీర మరణం పొందిన అమర జవాన్లకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్లో శనివారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదుల్ని అణచివేసి, ఉగ్రవాదులకు సహకరిస్తున్న పాకిస్తాన్‌ను తుదముట్టించేందుకు వీరోచితంగా పోరాడుతున్న వీర జవాన్లకు జేజేలు పలికారు. రెండు రోజుల క్రితం వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. ఉగ్రవాదులు, వారికి దన్నుగా ఉన్న పాకిస్తాన్ నశించాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దాసి సీతారామరాజు, యద్ధనపూడి మధు, కరిముల్లా, అడ్డాడ ప్రసాద్, ముమ్మనేని రాజ్‌కుమార్ (నాని), నిడమానూరి దిలీప్‌కుమార్, మోర్ల శివ, మీర్ రిజ్వాన్, బోలెం రామారావు ఇతర నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చల్లపల్లిలో అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు తదితరులు

కనులపండువగా గోకర్ణేశ్వరుడి రథోత్సవం

కోడూరు: లింగారెడ్డిపాలెంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణమూర్తులకు విశేష పూజలనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి గ్రామంలోని ఊరచెరువు వరకు గ్రామస్తులు రథాన్ని లాగి భక్తిభావం చాటుకున్నారు. ప్రతి ఇంటి వద్ద రథోత్సవానికి స్వాగతం పలుకుతూ మహిళలు నీటిని వారబోసి, హారతులిచ్చారు. రథాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. శనివారం ఉదయం గోకర్ణేశ్వరుడి మూలమూర్తికి పంచామృతాభిషేకాలను నిర్వహించారు. బిల్వార్చన, రుద్రాభిషేకాలను జరిపారు. ఉత్సవ మూర్తులకు అవబృందోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతిని జరపగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి స్వామివారికి, అమ్మవారికి పుష్పయాగాన్ని నిర్వహించారు. ఐదు రోజుల పాటు కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ సుధాకర్ తెలిపారు. జేపీ సీహెచ్ శివప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊరేగుతున్న స్వామివార్లు

పలువురు బాధితులకు పేర్ని కిట్టు పరామర్శ

మచిలీపట్నం రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో పలు ప్రమాదాలు, అనారోగ్య ఇబ్బందులు పడుతున్న బాధితులని శనివారం వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఇన్చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం పరామర్శించారు. బుద్దాలపాలెంలో రోడ్డు ప్రమాదంలో కుడి చేతికి గాయమై ఆపరేషన్ చేయించుకున్న బొర్రా దుర్గాప్రసాద్‌ను, ట్రాక్టర్ ప్రమాదానికి గురై మరణించిన కోకు వెంకటపూర్ణ తల్లి తండ్రులను పరామర్శించి ఓదార్చారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన బొర్రా సీతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో మరణించిన కాగిత ధనలక్ష్మి కుటుంబ సభ్యులను, బొర్రపోతుపాలెం పరిధిలోని పిల్లంగోళ్లపాలెంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన కుంభం సత్యవతి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నార్త్ మండల కన్వీనర్ మట్టా మోహన్ నాంచారయ్య సర్పంచ్ దండుమోలు బాబురావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోక్కు ఉమామహేశ్వరావు, వాలిశెట్టి సోము, కాలికారావు, అడబాల రాజేష్, పెయ్యల నాగరాజు, బొర్రపోతుపాలెం ఉప సర్పంచ్ వుయ్యూరు నాగ బుల్లబ్బాయ్, వైఎస్సార్ సీపీ నాయకులు పరింకాయల అశోక్, కొరేపల్లి రమేష్, జువ్వా అంజి, కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న కిట్టు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

ముగిసిన జయంతి ఉత్సవాలు

పెడన: పట్టణ పరిధిలోని వాసవి క్షేత్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న వాసవీమాత జయంతి ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం విశేష పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సంఘ అధ్యక్షుడు కొల్లూరి చిన్న, దేసు శ్రీనివాస్, ఏ సురేష్‌కుమార్, కే రాజా తదితర భక్తులు పాల్గొని కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సహాయ ఫౌండేషన్ సాయం

మచిలీపట్నం రూరల్: మండల పరిధి భాస్కరపురానికి చెందిన తాపీ కార్మికుడు రామాంజనేయులకు శనివారం సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ భాషా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రామాంజనేయులు ఇటీవల తాపీ పని చేస్తుండగా గోడకూలి కాళ్లపై పడటంతో కాలికి గాయమైంది. కుటుంబ పోషణ భారంగా మారింది. రామాంజనేయులకు భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. సహాయ ఫౌండేషన్ నిర్వాహకులు 5 వేల నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. సంస్థ మహిళా విభాగం అధ్యక్షురాలు కోన వెంకటేశ్వరమ్మ, సిబ్బంది అంకాల రామకృష్ణ, బడుగు ఉమా, కాజా, సప్పరపు రాజు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన కల్యాణ ఉత్సవాలు

శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో శ్రీ రాజ్యలక్ష్మీ భోగలక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వర స్వామి వారి (ఆంధ్ర మహావిష్ణు) కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు అగ్నిహోత్రం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో దేవస్థానం డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు సమక్షంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఈఓ శ్రీరామ వరప్రసాదరావు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు ‘పది’లో ప్రతిభావంతులకు సత్కారం

నాగాయలంక: స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు 11న సత్కారం చేస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శుక్రవారం తెలిపారు. మండలంలో ఐదు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతిలో మొదటి స్థానం పొందిన విద్యార్థులు అందరికీ ఈ సత్కారం చేస్తామన్నారు. 94906 364 66, 70936 17778 మొబైల్ నంబర్లకు విద్యార్థుల వివరాలు పంపించాలని పేర్కొన్నారు.

కేయూ క్యాంపస్ సెలక్షన్స్‌లో 251 మంది ఎంపిక

రుద్రవరం (మచిలీపట్నం రూరల్): కృష్ణా యూనివర్సిటీ క్యాంపస్ ఇంటర్వ్యూలో 251 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి తెలిపారు. శనివారం కృష్ణా యూనివర్సిటీ ప్లేస్మెంట్ విభాగం, నెక్స్ట్ హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 270 మంది విద్యార్థులు హాజరు కాగా టాటా గ్రూప్‌కి చెందిన ట్రెంట్ లిమిటెడ్, బ్లిఫిన్సర్వ్ ప్రైవేట్ లిమిటెడ్, కామెట్ స్టాఫింగ్, హెచ్1హెచ్ ఆర్, మెడ్ ప్లస్, టాలెంట్ ప్రో కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. వారిలో అత్యంత నైపుణ్యం కలిగిన 251 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం ట్రెనింగ్, ప్లేస్మెంట్ విభాగం డైరెక్టర్ ఆచార్య వైకే సుందరకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ట్రెనింగ్, ప్లేస్మెంట్ విభాగం సమన్వయకర్త డాక్టర్ కిషోర్, డాక్టర్ అలీ మీర్జా, నెక్స్ట్ హబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఈఓ సాయికృష్ణ, కేజీవీ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంజినీరింగ్ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి

నిందితుడ్ని అరెస్ట్ చేయాలని వినతి

అవనిగడ్డ: ఘంటసాల మండలంలో బీఎస్పీ కార్యకర్త సిద్దెల చందుపై దాడిచేసిన ఘటనలో కోర్టు ఆదేశాల మేరకు నమోదు చేసిన కేసులో నిందుతుడిని వెంటనే అరెస్ట్ చేయాలని బీఎస్పీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు గుంటూరు నాగేశ్వరరావు డీఎస్పీ కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందించారు. గత సంవత్సరం నవంబర్ 16న సిద్దెల చందు అనే బీఎస్పీ కార్యకర్తపై జనసేన నేత కోన రాజశేఖర్ అతని కుటుంబ సభ్యులు దాడి చేశారని చెప్పారు. దీనిపై ఘంటసాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని, కోర్టుకు వెళ్లగా కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో గత నెల 17వ తేదీన కేసు నమోదు చేశారన్నారు. అయినా ఇంతవరకూ నిందుతుడిని అరెస్ట్ చేయలేదని, అధికార పార్టీకి చెందిన నాయకుడు కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నాగేశ్వరరావు అన్నారు. పోలీసులు స్పందించి వెంటనే నిందుతుడిని అరెస్ట్ చేయాలని ఆయన కోరారు.

బహుజన సంకల్పసభకు రక్షణ కల్పించాలి

ఈనెల 20న చల్లపల్లిలో బహుజన సంకల్ప సభ జరుగుతుందని దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతంకుమార్ విచ్చేస్తున్న నేపథ్యంలో రక్షణ చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి వినతి పత్రం అందించారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దాల బాలయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు వంగలపాటి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు గుంటూరు కార్తీక్, చిట్టూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

చల్లపల్లి: ఈనెల 11వ తేదీన స్థానిక ఎస్సార్‌వైఎస్సీ హైస్కూల్‌కు చెందిన 1995- 96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సాగే ఈ కార్యక్రమంలో విద్యాబుద్ధులు చెప్పిన గురువులను గౌరవించుకోవటంతోపాటు పరిచయ కార్యక్రమాలు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులు అందరూ హాజరై ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని నిర్వాహక కమిటీ సభ్యులు పేరం మధుసూదనరెడ్డి, యడ్ల జగదీష్, ఉరిమి మణికాంత్ కుమార్, యడ్ల శ్రీకాంత్ తెలిపారు.

రేపు అంకాలమ్మ జాతర

అవనిగడ్డ: మండల పరిధిలోని వేకనూరులో ఈనెల 12న మాదివాడ అంకాలమ్మ జాతర జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 11న అంకాలమ్మ అమ్మవారికి, పోతురాజు స్వామికి అభిషేకాలు, సాయంత్రం గ్రామోత్సవం, 12న అమ్మవారికి పుట్టింటి వారిచే పసుపు కుంకుమల సమర్పణ, ప్రత్యేక పూజలు, 13న అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం

గూడూరు: మండల పరిధిలోని మల్లవోలు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ కె.గ్లోరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు తల్లులకు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రుల పట్ల, సమాజం పట్ల ఎలా ఉండాలో చిన్నవయస్సు నుంచే నేర్పించాలన్నారు. పిల్లలను పాఠశాలకు పంపే విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఉత్తమ తల్లులను ఎంపిక చేసి వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, జీఎంఎస్‌కే, తల్లులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను మండలంలో..

కృత్తివెన్ను: అంగన్‌వాడీ కేంద్రాలలో ముందస్తు మదర్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లికి వందనం అనే కార్యక్రమాన్ని నిర్వహించి, మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులతో తల్లిపాదాలు కడిగించి ఆశీర్వాదాలు అందించారు. అనంతరం చిన్నారులు స్వయంగా తయారు చేసిన పూలబొకేలను తల్లులకు కానుకగా అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్యామలాగౌరి, రాఘవమ్మ పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల పాదాలు కడుగుతున్న చిన్నారులు